


ఫ్యాన్సీ నంబర్‌కు రూ.4.55 లక్షలు

పరిగి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ పరిగి యూనిట్ కార్యాలయంలో ఫ్యాన్సీ నంబరు టీజీ34ఏ 9999 కోసం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో భారీ ధర పలికింది. బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి తన నూతన వాహనానికి నంబర్ కోసం ఈ వేలంలో పాల్గొని రూ.4,55,540కు దక్కించుకున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. కొత్త సీరిస్ ప్రారంభం కావడంతో రూ.7,17,149 భారీ ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

షెడ్‌ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పశువుల కాపరులు షెడ్‌లను నిర్మించుకోవాలని ఏపీవో శంకరయ్య సూచించారు. మండలంలోని బురుగుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గొర్రెలు, మేకల షెడ్‌ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. అర్హులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష చొప్పున అందిస్తామన్నారు.

చదువులో రాణించాలి

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. మంగళవారం తుర్కపల్లి మహాత్మ జ్యోతిబా పూలే, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్(బాలుర) స్కూల్, కాలేజీని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారితో కలిసి రాత్రి భోజనం చేశారు. తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాభాయ్, డీసీవో రాజేశ్, ప్రిన్సిపాల్ శీలా తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

నేడు మహాశివరాత్రి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పురాణ కథలను ప్రదర్శించే నాటకాలు ఏర్పాటు చేశారు. కీసరగుట్ట రామలింగేశ్వరాలయం, వికారాబాద్ సమీప బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయం, తాండూరు భూకైలాసాలయం మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయం, ఘట్‌కేసర్‌లోని స్పటిక లింగేశ్వర ఆలయం, అత్వెల్లిలోని భ్రమరాంబిక చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, దక్షిణ కాశీ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్, ఫిబ్రవరి 25

విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్న కీసరగుట్ట రామలింగేశ్వరాలయం


శివోహం!

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు .. ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


పరిగి బస్టాండ్ సమీపంలో వెలసిన పండ్ల దుకాణం


పండ్ల ధరలు పైపైకి..

- ప్రత్యేకంగా వెలసిన దుకాణాలు
- ధరలకు రెక్కలు.. కొనుగోలుదారుల బెంబేలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పండ్లు, పూల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. దీనికితోడు పట్టణాల్లో పదుల సంఖ్యలో కొత్త దుకాణాలు వెలిశాయి. శివరాత్రి పర్వదినాన భక్తులు రోజంతా ఉపవాస దీక్షలు చేసి సాయంత్రం పండ్లతో దీక్షలను విరమిస్తారు. ఇదే అదునుగా టెంట్లు వేసి మరీ పండ్ల అమ్మకాలను చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక ధరలకు పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఇటీవల ద్రాక్ష పండ్లు కిలో రూ.80 అమ్మగా పండగ సందర్భంగా రూ.120 నుంచి 160కి పెంచారు. కర్బూజ రూ.60 నుంచి రూ.70, పుచ్చకాయ కిలో రూ.40 నుంచి రూ.50, బత్తాయి రూ.25 నుంచి రూ.30 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండే అరటిపండ్లు సైతం రూ.50 నుంచి రూ.80కు పెంచారు. ఖర్జూర కిలో రూ.100 నుంచి రూ.120, సపోట కిలో రూ.25 నుంచి రూ.30, జామకాయలు కిలో రూ.60 నుంచి రూ.80 చొప్పున, యాపిల్ ఒకటి రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. పండుగకోసం ప్రత్యేకంగా వెలసిన దుకాణాల్లో ధరలు తక్కువగా ఉంటాయని ఊహించి అక్కడికి వెళ్తే ధరలు ఆకాశన్నంటుతున్నాయి.

పూల ధరలకు రెక్కలు

పండుగలు వస్తే చాలు పూల ధరలకు సైతం రెక్కలు వస్తాయి. నేడు మహాశివరాత్రి నేపథ్యంలో ఎప్పుడూ మూర మల్లెపువ్వులు, కనకంబరాలు రూ.15లకు ఇచ్చేది దాన్ని అమాంతంగా రూ.30కు పెంచేశారు. చామంతి పది రూపాయలకు ఇచ్చే వ్యాపారులు ఇప్పుడు ఇరవై రూపాయలకు పెంచి విక్రయిస్తున్నారు.



మహా వేడుకలకు ఆలయాల ముస్తాబు 5


విద్యుత్ దీపాల కాంతుల్లో వికారాబాద్ పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరాలయం

కల్యాణం.. కమనీయం

కనులపండువగా శ్రీరామలింగేశ్వరుడి పరిణయం


కల్యాణోత్సవంలో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి దంపతులు

- ఘనంగా స్వామివారి పల్లకీ సేవ
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనం
- కీసరగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కీసర, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని భవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు మంగళవారం మాఘ బహుళ ద్వాదశి పురస్కరించుకొని, శ్రవణ నక్షత్రయుక్త తుల లగ్నమందు స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హాజరై ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. అంతకు ముందు ఉత్సవ సేవల్లో భాగంగా ఉదయం స్వామివారికి శ్రీ మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆనంతరం యాగశాలలో గణపతిశర్మ ఆధ్వర్యంలో రుద్రస్వాహాకార హోమం, జ్వాలార్చన, ప్రదోషకాల పూజ, హారతి, మంత్రిపుష్పం, పరాకస్తం నిర్వహించారు.

నందివాహనంపై స్వామివారు

బ్రహ్మోత్సవాలో మొదటి రోజు స్వామివారి ఉత్సవ మూర్తులను కీసరగుట్ట నుంచి కీసరకు తీసుకురాగా, రెండోరోజు మంగళవారం వంశపారంపర్యస్తుల ఇంటి నుంచి నందివాహనం మీద, పల్లకీ సేవల్లో స్వామివారు ఊరేగింపుగా కీసరగుట్టకు బయలుదేరాడు. మహాశివరాత్రిని పురస్కరించుకొని నిర్వాహకులు ఆలయాన్ని స్వంగసుందరంగా ముస్తాబు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా తమిళుల రాక


ఎడ్లబండిపై వస్తున్న తమిళులు

శివరాత్రి ఉత్సవాల్లో తమిళులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. బ్రహ్మోత్సవాలల్లో భాగంగా కీసరలోని పోచమ్మ దేవాలయంలో యాప్రాల్, అమ్ముగూడ, సైనిక్‌పురి, ఈసీఐఎల్, లాల్‌బజార్, రిసాలబజార్, అల్వాల్, తిరుమలగిరి తదితర ప్రాంతాలలో ఉండే తమిళులు గ్రామదేవతకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, నేటికీ వారు ఎడ్లబండ్లలో వచ్చే ఆచారం, సంస్కృతి, సంప్రాదాయం పాటిస్తుండటం గమనార్హం. అలాగే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విద్యార్థులకు క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలిచిన టీమ్‌లకు బ్రహ్మోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తారు. గుట్టపై ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

'అమృత్ భారత్' పనులు ఆరు నెలల్లో పూర్తి

తాండూరు రైల్వేస్టేషన్‌లో రూ. 24కోట్లతో పనులు

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్


పనులను పరిశీలిస్తున్న అరుణ్‌కుమార్ జైన్

తాండూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ కార్యక్రమం కింద చేపట్టిన రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. మంగళవారం తాండూరు, రాష్ట్ర సరిహద్దు సేడం, చిత్తాపూర్ రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. తాండూరులో మీడియాతో మాట్లాడుతూ తాండూరు స్టేషన్ ఆధునికీకరణ, బ్యూటిఫికేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు, వసతులను కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే దృష్టి సారించిందన్నారు. పనులు నాణ్యతగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. చిత్తాపూర్‌లో లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్లతో కలిసి నిర్మాణంలోని రూమ్‌లు, ఇతర పనులను పరిశీలించారు. ఆయన వెంట దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం భరతేష్‌కుమార్, తాండూరు స్టేషన్ మాస్టర్, రైల్వే పోలీసులు ఉన్నారు.

వికారాబాద్ రైల్వేస్టేషన్ పరిశీలన

వికారాబాద్: వికారాబాద్ రైల్వేస్టేషన్‌ను మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం

మిగతా 6వ పేజీలో...


ఎల్లమ్మ(ఫైల్)


మొగులప్ప(ఫైల్)

హత్యా.. ఆత్మహత్యా?

- ఉరేసుకున్న స్థితిలో తల్లీకొడుకు మృతి
- హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపణ
- మృతుడి భార్యపై స్థానికుల అనుమానం
- బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఘటన

5

ఆస్తి కోసం తండ్రిని

చంపిన కొడుకు

పరిగి మండలంలో ఘటన

4

రైతుల సహకారంతోనే పారిశ్రామిక హబ్

- అభివృద్ధిలో భాగస్వాములవుతున్న వారు అభినందనీయులు
- పరిహార చెక్కులు అందజేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్


పరిహార చెక్కులు అందుకున్న రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

వికారాబాద్/కొడంగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవుతున్న రైతులు అభినందనీయులని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసే పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు దుద్యాల మండలం, లగచర్ల గ్రామానికి చెందిన 22 మంది రైతులకు సంబంధించిన 31.35 ఎకరాల భూమికి రూ.6.38కోట్ల నష్ట పరిహార చెక్కులను కలెక్టర్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల త్యాగాల ఫలితంగా పారిశ్రామిక పార్క్ ఏర్పాటు అవుతుందన్నారు. రైతుల సహకారంతో ఏర్పడనున్న పరిశ్రమ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధితోపాటు యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. భూములు ఇచ్చేందుకు సమ్మతించిన రైతులకు ఒకే దఫాలో చెక్కుల రూపంలో నష్టపరిహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. నష్ట పరిహారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడే విధంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ వోవీటీ శారద, అసిస్టెంట్ జోన్ మేనేజర్ అజీమా సుల్తానా, దుద్యాల తహసీల్దార్ కిషన్, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది, ఇంటర్ పరీక్షలు

కలెక్టరేట్‌లో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణ, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య

మిగతా 6వ పేజీలో...

ఘనంగా పార్వతీదేవి డోలారోహణం


ఉత్సవమూర్తులతో నిర్వాహకులు డాక్టర్ ముద్ద భక్తవత్సలం దంపతులు


డోలారోహణం నిర్వహిస్తున్న అక్కమహాదేవి మహిళా సమాజం సభ్యులు

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం అగ్నిగుండం ప్రజ్వలనం, స్వామి వారి పల్లకీసేవ, జగజ్జననీ పార్వతీదేవి జన్మదినోత్సవం, డోలారోహణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ వేద పండితుడు మఠపతి సాంబశివశర్మ, ఆలయ అర్చకుడు బస్వరాజస్వామి ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి కల్యాణ వేడుక కనులపండువగా జరిగింది. రాత్రి భవనం నుంచి మహాశక్తి చౌరస్తా వరకు ఉత్సవమూర్తులతో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ ముద్ద దీపా, డాక్టర్ ముద్ద భక్తవత్సలం, ఆలంపల్లి చంద్రశేఖరస్వామి, నాగేశంస్వామి, శివశంకర్, శ్రీకాంత్, కోటిలింగం, వీరశైవ సమాజం, అక్కమహాదేవి మహిళా మండలి, బసవ యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టరపట్టు హైలెస్సా



వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సులకు కేరాఫ్ అడ్రస్‌గా వికారాబాద్ బస్ డిపో నిలుస్తుంది. ఎప్పుడూ ఏ బస్సు ఆగుతుందో తెలియక డ్రైవర్లు కండక్టర్లు బిక్కుబిక్కుమంటూనే బస్సులు రోడ్లపై తీసుకపోతున్నారు. బస్సులు ఎక్కడపడితే అక్కడ మొరాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మంగళవారం రాత్రి వికారాబాద్‌లో బస్సు మొరాయించడంతో కండక్టర్ పట్టణ ప్రజల సహకారంతో బస్సు తోయడం కనిపించింది. ఇది చూసినవారు శివ శివ ఇదేం తీరు అన్నట్లుగా మాట్లాడుకోవడం వినిపించింది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 2025 ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచేందుకు ఆర్బీఐ సూచనల మేరకు మంగళవారం మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 2కె వాక్‌ను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రవతి, జిల్లా సంక్షేమాధికారి సాంబశివరావు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల దుర్మరణం


చంద్రశేఖర్(ఫైల్)


మత్స్యగిరి(ఫైల్)

కీసర రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ప్రమాద స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. ఈ ఘటన సోమవారం రాత్రి మేడ్చల్ జిల్లా కీసర మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రహీంఖాన్‌గూడకు చెందిన గూడూరు చంద్రశేఖర్(32), అతడి తమ్ముడు మత్స్యగిరి(27) ఉపాధి కోసం నగరానికి వలసొచ్చారు. చంద్రశేఖర్ దర్జీ పని చేసుకుంటూ తార్నాకలో, మత్స్యగిరి విజయ డెయిరీలో ఉద్యోగం చేసుకుంటూ లాలాగూడలో ఉంటున్నారు. సోమవారం వీరిద్దరు, తమ అల్లుడు శ్రీనుతో కలిసి ముగ్గురు తమ ద్విచక్రవాహనంపైన దమ్మాయిగూడ మున్సిపాలిటీ యాద్గార్‌పల్లిలోని బంధువుల ఇంటికి చేరుకున్నారు. పని ముగించుకుని తిరిగి వస్తూ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు గుండా యాద్గార్‌పల్లి-చీర్యాల ప్రాంతానికి చేరుకున్నారు. ఎదురుగా వచ్చిన కారు(థార్) వేగంగా వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురూ రోడ్డుపైన పడిపోయారు. తీవ్రగాయాలతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మత్స్యగిరి, శ్రీనులను గాంధీ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మత్స్యగిరి చనిపోయాడు. శ్రీను చికిత్స పొందుతున్నాడు. మృతులిద్దరూ తోడబుట్టిన అన్నదమ్ములు. కాగా మత్స్యగిరి పెళ్లి వచ్చే నెల 20న జరగాల్సి ఉంది. చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు


పీర్ మహ్మద్, నిందితుడు

పరిగి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటాకోసం ఓ కొడుకు కన్న తండ్రిని కొట్టి చంపిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎండీ రహీం(72)కు ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం. రహీంతో భూమి వాటా విషయంలో చిన్న కొడుకు పీర్‌మహ్మద్ గొడవపడుతున్నాడు. సోమవారం రాత్రి పీర్‌మహ్మద్ పనిచేసే ఫామ్‌హౌజ్‌లో తండ్రితో గొడవపడగా గ్రామస్తుడు వారిని వారించి ఇంటికి పంపించాడు. మంగళవారం ఉదయం ఇంట్లో పీర్‌మహ్మద్ మరోసారి తండ్రిని కట్టెలతో కొట్టాడు. తీవ్ర గాయాలైన రహీంను భార్య పర్వీన్‌బేగం, పెద్ద కొడుకు పాషా పరిగి అస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా రహీం చనిపోయాడు. రహీం చెల్లెలు కరీమాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పీర్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మహా వేడుకలకు ముస్తాబు

- శివ నామస్మరణతో మార్మోగుతున్న శైవక్షేత్రాలు
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి
- నిత్య పూజలతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు

మహా శివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి సందర్భంగా ఊరూ వాడా ఆధ్యాత్మికతను సంతరించుకోనుంది. ప్రముఖ ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడకల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల జాగరణ, భజనలు, ప్రత్యేక కార్యక్రమాలతో ఆలయాలు శోభిల్లనున్నాయి.



మునులు నడయాడిన నేల.. మల్లప్పగుట్ట

తలకొండపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నారం గ్రామ సమీపంలో మల్లప్పగుట్టపై వెలసిన మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. మునులు ఇక్కడ తపస్సు చేసిన ఆనవాళ్లు కన్పిస్తాయి. వేసవిలో గుట్టపై ఉన్న గుండంలో నీళ్లు ఉండడం విశేషం. ఇక్కడ స్వామివారిని దర్శించుకున్న భక్తులు శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శించుకున్నట్లుగా భావిస్తారు. శివరాత్రి రోజు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు, హోమాలకు ఈ ఆలయం ప్రసిద్ధి.



అయ్యసాగర్ శివాలయం

ఆహ్లాదకరం.. త్రిపురాంతకేశ్వరాలయం

ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనుంతల గేటు సమీపంలోని అయ్యసాగర్ శ్రీ వీరభద్ర స్వామి ఆలయం ఆహ్లాదమైన వాతావరణంలో దినదినాభివృద్ధి చెందుతూ ప్రముఖ పుణ్య క్షేత్రం, పర్యాటక ప్రాంతంగా బాసిల్లుతుంది. ఎత్తైన కొండల నడుమ, అటవీ ప్రాంతంలో ఈ ఆలయం ఉంది. మునులు ఇక్కడ తపస్సు చేసినట్లు చరిత్ర చెబుతుంది. వార్షిక బ్రహ్మోత్సవాలతోపాటు వివిధ సందర్భాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు. గుట్టపై వీరభద్ర స్వామి ఆలయానికి విశాలమైన రోడ్డు నిర్మాణం చేపట్టారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి భక్తులు వస్తారు.



భక్తుల ఇష్ట దైవం.. బుగ్గ రామలింగేశ్వరాలయం

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతపద్మనాభ స్వామి ఆలయం, మల్లికార్జున ఆలయం, రామ మందిరం, వేంకటేశ్వర స్వామి దేవాలయంతోపాటు నియోజకవర్గంలోని వెల్‌చాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఎన్కతల శనైశ్వర ఆలయం, పులుసుమామిడి పార్వతీ పరమేశ్వరుని గుట్ట వేడుకలకు సిద్ధమయ్యాయి.

మైసిగండి శివాలయంలో ప్రత్యేక పూజలు



మైసిగండి శివాలయంలో పూజల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, తదితరులు

కడ్తాల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కడ్తాల మండలంలోని మైసిగండి శివరామాలయంలో శ్రీకాశీవిశ్వనాథ స్వామి మహాశివ రాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు కొనసాగే వేడుకలకు ఆలయాన్ని అందగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాలను ఈఓ స్నేహలతతో కలిసి ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ ప్రారంభించారు. మైసిగండి శివ, రామాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న మొక్కలు నాటారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో కాశీవిశ్వనాథ స్వామికి మేలుకొలుపు పాడారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌ను అలంకరించి అర్చకులు అమూల్యపతి, భానుప్రకాశ్, నాగేంద్ర శర్మ విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహనం, రుద్రాభిషేకం, గణపతిహోమం, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు భాస్కర్‌వాగ్దేవి దంపతుల ఆధ్వర్యంలో హోమం, గణపతిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు రామావత్ పాండు నాయక్, రాజారాం, నిర్వాహకుడు రామావత్ భాస్కర్, తహసీల్దార్ ఆర్‌పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పాత తాండూరులో కోటేశ్వరాలయం

రాముడు ప్రతిష్ఠించిన శివలింగం

తాండూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయం త్రేతాయుగంలో వెలిసినది. ఈ ఆలయంలో లింగాన్ని శ్రీరాముడు ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతుంది. అక్కన్న మదన్నలు ఈ ఆలయాన్ని సందర్శించారు. శ్రీరామచంద్రుడు తండ్రి మాటతో రాజ్యాన్ని వీడి మునీశ్వరుల ఆశ్రమ సందర్శనలో నిమనగ్నమయ్యారు. వారి ఆశీర్వాదంతో ముక్కొంటి లింగాలను స్థాపించినట్లు వాల్మీకి, రామాయణపు కథల్లో ఉంది. ఆ ముక్కోటి లింగాల్లో కోటేశ్వర లింగమొకటి.



పెద్దేముల్ మండలంలోని తట్టేపల్లి అంబరామేశ్వర ఆలయం వద్ద భక్తుల సందడి

అటవీ ప్రాంతంలో అంబురామేశ్వరుడు

పెద్దేముల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టెపల్లి, పాషాపూర్ గ్రామాల మధ్యగల దట్టమైన అటవీప్రాంతంలో దశాబ్దల చరిత్ర కలిగిన అంబురామేశ్వర దేవాలయం ఉంది. పచ్చని చెట్లు, నిత్యం ప్రవహించే సెలయేరు, ప్రకృతి రమనీయమైన అందాలు చూపరులను ఆకట్టుకుంటాయి. ఆలయం వద్ద లోయలోకి వేళ్లే ముందు పైన మనకు ఒక్కచుక్క నీరు కూడా కనిపించదు. కానీ, లోయలోని దేవాలయం వద్దకు చేరుకోగానే గలగల పారుతున్న సేలయేరు కనిపిస్తుంది. శ్రీరాముడు నడయాడాడని, స్వయంగా శివలింగాన్ని స్థాపించాడని చరిత్ర ఉంది. ఇక్కడ పాండవులు వనవాసం చేసే సమయంలో ఇక్కడి లోయలోని జమ్మిచెట్టుపై వారి అంబులు(ఆయుధాలు) దాచిపెట్టినట్లు చెపుతుంటారు. అందుకే ఈ ఆలయానికి అంబురామేశ్వర దేవాలయం అని పేరువచ్చినట్లు పూర్వీకులు అంటున్నారు. శివరాత్రికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

'త్రివేణి సంగమం'.. సంగమేశ్వరాలయం



యాలాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మూడు నదుల కలయిక ప్రాంతమైన యాలాల మండలం సంగెంకుర్దు సమీపంలోని సంగమేశ్వర ఆలయం శివరాత్రి ఉత్సవాకు ముస్తాబైంది. నాలుగు శతాబ్దాలుగా భక్తుల పూజలందుకుంటున్నది. ఆదివారం పౌర్ణమిన త్రివేణి సంగమంలో స్నానం ఆచరిస్తే పాపాలు పోతాయని భక్తుల నమ్మకం. శివరాత్రి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు.

జాఫర్‌పల్లిలో నవోదయం

కేంద్ర మంత్రికి బీసీ సంఘం నేతల వినతి

జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు

పరిగి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం జాఫర్‌పల్లి గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర విద్యాశాఖ పరిశీలిస్తున్నది. పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన జాఫర్‌పల్లిలో కేంద్ర జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసి ఇటీవల వినతిపత్రం అందజేశారు. ఈ విజ్ఞప్తి మేరకు కేంద్రవిద్యశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ జాఫర్‌పల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర విద్యశాఖ ఉన్నత అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు కేంద్రమంత్రి తిరిగి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణ, లాల్‌కృష్ణప్రసాద్‌లకు మంగళవారం తిరిగి లేఖ ద్వారా సమాచారం అందించారు. తెలంగాణంలో ఇప్పటివరకు పాత పది జిల్లాల్లో పది విద్యాలయాలు కొనసాగుతున్నాయి. నెల క్రితం ఆరు విద్యాలయాల ఏర్పాటుకు మంజూరు ఇచ్చింది. కొత్తగా పరిగి మండలం జాఫర్‌పల్లిలో కూడా జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. జాఫర్‌పల్లి పూర్తిగా గ్రామీణ ప్రాంతమని, ఇక్కడ ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ విద్యా సంస్థ ఏర్పాటుకు ఆర్ కృష్ణయ్యతో కలిసి మరోసారి కేంద్రమంత్రిని కలుస్తామని పేర్కొన్నారు.

త్రివేణి సంగమంలో చీఫ్ విప్ దంపతులు



త్రివేణి సంగమంలో స్నానం ఆచరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ కుంభమేళలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ సునితారెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగరాజ్‌లోని గంగ, యుమున, సరస్వతి నదుల సంగమం త్రివేణిలో పవిత్ర స్నానాన్ని ఆచరించి సూర్యనమస్కారాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్వీ రమణారెడ్డి, చాముండేశ్వరి, కూతురు మనీషారెడ్డి, అల్లుడు హిమదిప్‌రెడ్డి ఉన్నారు.

డబుల్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణమే పూర్తి చేసి అర్హులైన పేదలకు, కార్మికులకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెండింగ్‌లో ఉన్న ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని త్వరగా పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో, రూరల్ గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని, అర్హులైన పేదలకు, కార్మికులకు స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రతి పేదవారికి స్థలం కేటాయించే వరకు సీపీఎం పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎరుకల సత్యనారాయణ, మద్దులపల్లి సుదర్శన్, నాయకులు జోగు లాలయ్య, హరిజన్ లక్ష్మయ్య, బిల్లపాటి యాదయ్య, చిట్టెంపల్లి ఏళ్లయ, కన్నా, నర్సింహారెడ్డి, బసిర్, జహంగీర్ పాల్గొన్నారు.


రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం



కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు ఆధ్వర్యంలో కోత్వాల్‌గూడ, శంషాబాద్ మండలంలోని వివిధ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కార్తీక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని, రైతులకు రుణమాఫీ, పింఛన్, కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రియల్ ఏస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందన్నారు. బీఆర్‌ఎస్‌లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం బీఆర్‌ఎస్ అధికారంలో వస్తోందని, కార్యకర్తలు సైనికుల్లా పని చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటి చరణ్, మాణిక్‌రెడ్డి, బాలు, శ్రీనివాస్, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య సేవలపై ఆరా



వైద్య సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య అదనపు సంచాలకులు పుష్ప

వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య అదనపు సంచాలకులు డాక్టర్ పుష్ప వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం రిజిస్ట్రైన ప్రైవేట్ ఆస్పత్రుల పనితీరు గురించి చర్చించారు. వికారాబాద్ పట్టణంలోని ఇషా హాస్పిటల్, అనంత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడిక్యూర్ ఆసుపత్రులను పరిశీలించి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నిబంధనల అమలుపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో పేషెంట్లకు, వారి అటెండెంట్‌లకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, సిబ్బంది సునీల్ రాజ్, అనిల్, నిరంజన్ రావు, వెంకట్ రామ్ రెడ్డి, రమావాణి పాల్గొన్నారు.

చికెన్ పకోడి, గుడ్లు ఉచిత పంపిణీ



చికెన్‌పకోడీ, గుడ్లు పంచుతున్న చికెన్‌సెంటర్ నిర్వాహకులు

కులకచర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చౌరస్తాలో చికెన్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం చికెన్ పకోడి, ఉడికించిన గుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కోళ్లను, వాటి గుడ్లను తినడం ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చికెన్, గుడ్లు తిన్నా ఎలాంటి వ్యాధి సోకదని అవగాహన కల్పించేందుకు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు బాలాజీనాయక్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, వెన్‌కాట్ సేల్స్‌మెన్‌లు పాల్గొన్నారు.



నెర్రెలు బారిన రోడ్డు(పాత చిత్రం)

నెర్రెలు బారిన రోడ్డుకు మరమ్మతులు

హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

కేశంపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగెం- వేముల్‌నర్వ రోడ్డులో నెర్రెలు బారిన రోడ్డుపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో గత డిసెంబర్ 29న వచ్చిన వార్త కథనానికి అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. నెర్రలు బారిన రోడ్డును పూర్తిగా తొలిగించి, అక్కడ నూతనంగా బీటీ వేశారు. రోడ్డును బాగు చేయడం పట్ల వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. సంగెం- వేముల్‌నర్వ గ్రామల మధ్య మిగిలిపోయన రోడ్డును పూర్తి చేస్తున్నారు. వేముల్‌నర్వ గ్రామంలో సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే వేముల్‌నర్వ నుంచి సంగెం మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నూతనంగా వేసిన రోడ్డు



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

చేవెళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా పరిష్యత్ అధికారి(జెడ్పీసీఈవో) కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల పరిష్యత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న పంచాయతీ బోర్లను అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందన్నారు. జిలాలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. అధికారులు, గ్రామ కార్యదర్శులు విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు, సూపరింటెండ్ రవీందర్ ఉన్నారు.

మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు

వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. మార్చి 2 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు 29 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలకు 16439 మంది విద్యార్థులు హాజరు హాజరవుతారని, ఇంటర్ మొదటి సంవత్సరంలో 7914 విద్యార్థులు ఉండగా ఇందులో జనరల్ 6418, వృత్తి విద్యలో 1496 మంది పరీక్షలు ఉన్నట్లు వివరించారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 6963మంది విద్యార్థులుండగా 5589 మంది జనరల్ కాగా 1374మంది వృత్తి విద్య కోర్సుకు సంబంధించిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం ప్రైవేట్ విద్యార్థులు జనరల్‌కు సంబంధించి 1562 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఫత్తేపురం బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు



పాడైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తీగలవాగు బ్రిడ్జి, ఫత్తేపురం బ్రిడ్జిలతోపాటు పాడైన రోడ్డును రోడ్డు భవనాల శాఖ అధికారులతో కలిసి శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ వెంకటేషం మంగళవారం పరిశీలించారు. గుంతలమయమైన ఫత్తేపురం బ్రిడ్జితోపాటు అసంపూర్తి పనులతో నిలిచిన తీగలవాగు బ్రిడ్జితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ వెంకటేషం రోడ్డు భవనాల శాఖ డీఈ రమేష్ దృష్టికి తెచ్చారు. ఫత్తేపురం బ్రిడ్జిపై పనుల కోసం టెండర్ పనులు పూర్తి అయ్యాయని, మరో 15రోజుల్లో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. శంకర్‌పల్లి - ఫత్తేపురం నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం కోసం నాలుగేళ్ల క్రితం శిలాఫలకం వేయగా, కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయక పోవడంతో టెండర్ రద్దు చేశామని డీఈ వివరించారు. త్వరలో టెండర్ వేసి మిగిలిన పనులు సైతం సకాలంలో పూర్తి చేస్తామని చెప్పారు. తీగలవాగు వద్ద పాగైన రోడ్డును 200మీటర్ల మేర మున్సిపల్ నిధులతో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని కమిషనర్ తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

- ఉరేసుకున్న స్థితిలో తల్లీకొడుకు మృతి
- మృతుడి భార్యపై స్థానికుల అనుమానం
- బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఘటన



అడ్డుకుంటున్న బంధువులు, స్థానికులు

బషీరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో తల్లీకొడుకు మృతి చెందారు. ఇంట్లో దూలానికి ఇద్దరూ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరినీ ఎవరో హత్య చేసి ఉరేసుకున్నట్లు వేలాడదిశారని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో మంగళవారం ఉదయం వెలుగుచూసిన ఈ ఘటన మిస్టరీగా మారింది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కాశీంపూర్‌నకు చెందిన మాల ఎల్లమ్మ(54), ఆమె కుమారుడు మొగులప్ప(35), కోడలు రేణుక, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. ఎల్లమ్మ వ్యవసాయ కూలీకాగా, మొగులప్ప పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మొగలప్ప భార్య రేణుక కూడా కూలి పనులు చేస్తోంది. కాగా, దంపతుల మధ్య తరుచూ జీతం డబ్బుల విషయంలో గొడవలు జరిగేవని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల పంచాయతీలో జీతం రాగా డబ్బుల విషయమై గొడవ జరుగగా, రేణుక రెండు రోజుల కిందట భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తల్లీకొడుకు కుంగిపోయి ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లీకొడుకు మృతిచెందిన రోజు చిన్నారి బాలుడు నందకిషోర్‌తో కలిసి ఒకే గదిలో నిద్రించారు. రేణుక, కూతురు వెన్నెలతో మరో గదిలో నిద్రించినట్లు పోలీసు విచారణలో తేలింది. తెల్లవారుజామున నందకిషోర్ రోదించగా గది తెరిచి చూడగా ఇద్దరు దూలానికి వేలాడుతూ కన్పించారని రేణుక పోలీసులకు తెలిపింది. అయితే రేణుక ప్రవర్తన సరిగా లేదని, ఆమె వల్లే ఇద్దరూ చనిపోయారని కొందరు మహిళలు ఆమెను చితకబాదారు. వారిబారి నుంచి పోలీసులు రేణుకను రక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మొగులప్ప ప్యాంట్ నుంచి రక్తం కారడం గమనించారు. దీంతో వారి బంధువులు తల్లీకొడుకును చంపారని ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. రేణుకకు వివాహేతర సంబంధాలున్నాయని, అందరూ కలిసి హత్య చేసి ఉండొచ్చని ఆరోపించారు.

తాండూరు ఆస్పత్రిలో పోస్టుమార్టం

రూరల్ సీఐ నగేశ్, క్రైం పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టంకు సహకరించాలని సీఐ సమూదాయించారు. ఎవరిపైనైనా అనుమానం ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. చివరకు మృతదేహాలను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. కాగా బంధువు నర్సమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు


తాండూరు రూరల్: హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్


తాండూరు రూరల్: భూకైలాస్ ఆలయంలో హోమంలో పాల్గొన్న శంకర్‌నాయక్ దంపతులు


ఘట్‌కేసర్: విద్యుత్ కాంతుల్లో పోచారంలోని స్పటిక లింగేశ్వరస్వామి దేవాలయం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. తాండూరు మండలం అంతారం తండాలోని భూకైలాస్‌లో మహాశివరాత్రి సందర్భంగా మహారాష్ట్ర నీటి సంరక్షణ క్యాబినెట్ మంత్రి సంజయ్ రాథోడ్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ తారాసింగ్‌లు భూకైలాస్ సందర్శించిన హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు వాసుపవర్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు శంకర్ నాయక్‌లతో కలిసి ఆలయంలో భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి సంజయ్ రాథోడ్ హెలిక్యాప్టర్ ద్వారా భారీశివుడి విగ్రహంపై పూలవర్షం కురిపిస్తామని వాసు పవర్ నాయక్ తెలిపారు. హెలిప్యాడ్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా భారీ భద్రతతో భారీ కేడ్లు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు చేపట్టేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సీఐ సంతోష్ కుమార్‌ను డీఎస్పీ ఆదేశించారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు వాసుపవర్ నాయక్ అధికారులకు వివరించారు. వారి వెంట అంతారం తండా మాజీ సర్పంచ్ రాంచందర్, మాజీ ఎంపీటీసీ శాంత్, సర్వేయర్ మహేష్ ఉన్నారు. అదేవిధంగా అంతారం తండా భూకైలాస్ దేవాలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం దేవాలయంలో హోమం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నాయక్ దంపతులు, వాసుపవార్‌నాయక్ దంపతులు పాల్గొన్నారు.

తాండూరు: భవనీ నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శ్రీకోటేశ్వర ఆలయ శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం(నేడు) లక్ష దీపార్చన, అగ్ని గుండ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కోటేశ్వర ఆలయ పాలక మండలి కార్యదర్శి నిర్ని సోమనాథ్ తెలిపారు. పూజా కాశీ పీఠాధిపతి, అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు ఆచార్య పరమానందగిరి స్వామి, తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షుడు శంకర్ స్వామి, తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు. రాత్రికి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పూజ, అగ్ని గుండ పూజ ఉంటుందన్నారు. అదేవిధంగా గురువారం(రేపు) తెల్లవారుజామున మల్లికార్జునస్వామి పల్లకీ సేవ, అగ్నిగుండ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాత తాండూరు వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని రామలింగేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు జి.మల్లేశం తెలిపారు.

చౌడాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శివాలయాలను ముస్తాబు చేశారు. శివరాత్రి సందర్భంగా నేడు ఆలయాల్లో అఖండ దీపారాధన, లక్ష్మీగణపతి హోమం, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని శ్రీ సంగమేశ్వర ఆలయంలో కోయంబత్తూర్‌లో జరిగే జగ్గీ వాసుదేవ్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు బుధవారం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అమ్రాదిరామ్‌రెడ్డి, మహంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

నవాబుపేట: ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు మండలంలోని నారేగూడలో భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మాణిక్ రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కొడంగల్ రూరల్: మండలంలోని మైసమ్మ తండా సమీపంలో వెలసిన అడవుల మైసమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు, జల్దీ ఉత్సవం, బోనాలు, అన్నదానం, పల్లకీ సేవ, అడుగుల భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో గల సర్వ మంగళసమేత స్పటిక లింగేశ్వర ఆలయం, ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడలోని శివాలయం, ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శివాలయం, కొదండ రామాలయం క్షేత్రాలను మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. నేటి ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు భక్తులు నిర్వహించే పూజలు, జాగరణ చేసే భక్తుల కోసం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

శామీర్‌పేట: మహా శివరాత్రి పురస్కరించుకుని తూంకుంట మున్సిపల్‌లోని శివాలయాలు మంగళవారం సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. శివపార్వతుల కల్యాణం కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పచ్చని పందిళ్లు, రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

ఘట్‌కేసర్ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. అవుషాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాప్‌సింగారం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలు, ఎండల దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చలువపందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలోని శ్రీ భవాని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గణపతి హోమం నిర్వహించారు. నేడు శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. గణపతి హోమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ఆయన సతీమణి చంద్రకళ పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: గణపతి హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు

క్రైం కార్నర్

ఇటుక బట్టీలో విద్యుత్ చౌర్యం

- విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- నిర్వాహకులకు రూ.1.60లక్షల జరిమానా

తాండూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీలకు యజమానులు అడ్డూ అదుపు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో విద్యుత్‌శాఖ, విజిలెన్స్ అధికారులు అప్రమత్తమై విజిలెన్స్ అధికారుల బృందంతో తనిఖీలు చేపట్టగా అక్రమార్కులు పట్టుబడ్డారు. మండలంలోని అంతారం భూకైలాస్ ఆలయ సమీపంలో అనిల్, రమణయ్య, సురేష్, శ్రీనివాస్‌రెడ్డిలు కొద్ది సంవత్సరాలుగా ఇటుక బట్టీలను కొనసాగిస్తున్నారు. అయితే వీరు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఇటుక బట్టీల వద్ద వారి మీటర్లను పరిశీలించగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు విద్యుత్ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు ఒక్కొక్క యజమానికి రూ.40వేల చొప్పున రూ.1.60లక్షల జరిమానా విధించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఇప్పటికైనా ఇటుక బట్టీ యజమానులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఏడీ హెచ్చరించారు.

కీచక ఉపాధ్యాయుడిపై విచారణ

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కీచక ఉపాధ్యాయుడి కథనంపై విద్యాశాఖ యంత్రాంగం కదిలింది. వికారాబాద్ మండలంలోని ఒక గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం మండల విద్యాధికారికి కాల్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం విచారణ చేపట్టారు. విచారణలో అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో మాట్లాడారు. విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడి జరిగిన విషయం తెలుసుకుంటున్నట్లుగా తెలిసింది.

ఎక్స్‌కవేటర్ సీజ్

పరిగి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమిలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు పరిగి ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రతిమ తెలిపారు. దీనిపై పూర్తి విచారణ జరిపించి, అటవీ భూమిలోకి అక్రమంగా వచ్చిన ఎక్స్‌కవేటర్ యజమానికి రూ.30వేల జరిమానాను విధించినట్లు తెలిపారు. అటవీ సంరక్షణ చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా కఠినచర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

రైల్వే అండర్ పాస్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) మహా శివరాత్రి సందర్భంగా పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేసే భక్తులకు మార్గం ఏర్పాటు చేయడానికి మంగళవారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డీఈఈ విజయలక్ష్మీతో కలిసి రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ పాస్ వంతెన వద్ద నుంచి మార్గాన్ని ఏర్పాటుచేస్తున్నారు. అధికారులతో పాటు మున్సిపల్ కాంగ్రెస్ నాయకుడు మర్రి నర్సింహారెడ్డి వంతెనను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

రైల్వే సర్వీసులను పొడిగించాలి

తాండూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వైపు వెళ్లేందుకు రైల్వే సర్వీసులను పొడిగించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్‌ను తాండూరు ప్రజలు కోరారు. తాండూరు రైల్వే స్టేషన్‌ను మంగళవారం సందర్శించిన జీఎంను మార్వాడీ యువమంచ్, రైల్వే ప్రయాణికులు సన్మానించారు. అనంతరం తాండూరు రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు హైదరాబాద్ వైపు వెళ్లేందుకు రైళ్ల సౌకర్యం లేదని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇంటర్‌సిటీ రైల్వే సర్వీసులు, రేపల్లే, పల్నాడు సర్వీసులను తాండూరు వరకు పొడిగించాలని కోరారు. ఈ మేరకు జీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

మర్పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ముస్తాఫఖాన్, అధ్యాపకులు పండరీనాథ్, వీరేశం, శ్రీనివాస్, వెంకటేశ్, లక్ష్మణ్, జమీల్, కార్తీకేయ, వెంకటేశం పాల్గొన్నారు.

వికారాబాద్: పట్టణంలోని గౌతమి జూనియర్ కళాశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు.

అత్వెల్లి డంపింగ్ యార్డును తొలగించాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి చెత్త డంపింగ్ యార్డును తొలగించి ఇతర ప్రాంతంలో డంపింగ్ చేయాలని స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామ శివార్లలో ఉండే డంపింగ్‌యార్డు ప్రస్తుతం గ్రామ సమీపంలోకి వచ్చిందన్నారు. దీని నుంచి వెలువడుతున్న దుర్గంధం, 24గంటల పాటు దగ్ధమవుతున్న చెత్త, పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాకట ప్రేమ్‌దాస్, ఈశ్వర్, రాగం అర్జున్, బాబు రాజు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్ ఎంపీవోగా రవి

బొంరాస్‌పేట్: మండల నూతన ఎంపీవోగా రవి బాధ్యతలు చేపట్టారు. ఘట్‌కేసర్ మండలం నుంచి బదిలీపై బొంరాస్‌పేట్ మండలానికి వచ్చారు.







రైతుల సహకారంతోనే పారిశ్రామిక హబ్

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో మరమ్మతులు, ఉపాధి హామీ పథకం అమలు, వసతి గృహాల తనిఖీ, ధరణి తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు ఎంపీడీవోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు పోలీస్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేసేందుకు వీలుగా ఒక ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా విధులు నిర్వహించే అధికారులపై చర్యలు తప్పవన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

పహాణి స్కానింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరమ్మతుల పనులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ తెలిపారు ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు, పారిశుధ్య పనులపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా సమన్వయ సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, డీఈవో రేణుకాదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కుటుంబ సభ్యుల్లా మెలగాలి

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలు కుటుంబసభ్యుల్లా మెలగాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. పట్టణంలోని ఎన్నెపల్లిలోని బీఆర్ఎస్ భవన్‌లో మంగళవారం వికారాబాద్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకుల కార్యకర్తల అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వార్డుల వారిగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు బీఆర్ఎస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ గోపాల్ ముదిరాజ్,కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుభాన్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా గాండ్ల మల్లికార్జున్‌లను నియమించారు. పట్టణ, మండల నాయకులు సంయుక్తంగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేక చంద్రశేఖర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రమేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, లక్ష్మణ్, రాములు, శేఖర్, పాండు, విజయ్ కుమార్, మహిపాల్‌రెడ్డి, అశోక్, దేవదాసు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ పట్టణ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ఈడబ్ల్యూఎస్ కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం ప్రజాభవన్‌లో ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హౌజింగ్ కార్పొరేషన్ వద్ద ఉన్న పట్టాలను ఇప్పించాలని కోరారు. 1975వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావు హయాంలో 469మంది పేదలకు ఇళ్లపట్టాలు జారీ చేశారని గుర్తుచేశారు. అనంతరం పట్టా సర్టిఫికెట్లను హౌజింగ్ కార్పొరేషన్ అధికారులు తీసుకొని ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు వివరించారు. 10శాతం మందికి పట్టా సర్టిఫికెట్లు, ఎన్‌వోసీలు జారీ చేశారని తెలిపారు. మిగిలిన 90శాతం మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు గానీ, ఎన్‌వోసీలు గానీ ఇవ్వకపోవడం వల్ల తీవ్రఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. 40ఏళ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కేశవపట్నం అంజనేయులు, ప్రధాన కార్యదర్శి శశిధరన్, కాంగ్రెస్ నాయకులు మామిండ్ల ముత్యాలు యాదవ్, బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మసీద్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలి

కొడంగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో మసీద్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలని మైనారిటీ నాయకులు కోరారు. మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు వినతి పత్రం అందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

పరిగి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపోల్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు రూ.78వేల విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళవారం పరిగి ఎస్ఐ సంతోష్‌కు అందజేశారు.

సంక్షిప్తంగా..

అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ కమిటీ ఎన్నిక

కొడంగల్: అంబేడ్కర్ సంఘం కొడంగల్ నియోజకవర్గ కమిటీని మంగళవారం కొడంగల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా బి.లక్ష్మణ్, చందు, ప్రధాన కార్యదర్శిగా ఎల్.బాలు, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా సురేశ్‌బాబు, సభ్యులుగా భీములు, ఎం.వెంకట్, కృష్ణ, శివ, మహేశ్, బీ.శ్రీను, మల్కప్ప, అంజిలప్ప, రాజు, సలహాదారులుగా ఎస్.సోమశేఖర్, ఎన్.దస్తప్ప, డి.దాము, బి.సుభాష్, కె.సాయిలు, ఎం.అశోక్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

తండాల అభివృద్ధే లక్ష్యం

కులకచర్ల: గిరిజన తండాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మంగళవారం పటేల్‌చెరువు తండా పరిధిలోని కిచ్చన్నకుంట తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రభూపాల్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మొరంగపల్లిలో రూ.10 లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి స్వప్న తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేసే ప్రసక్తే లేదన్నారు. అర్హులను మాత్రమే గుర్తించాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కారోబార్ పవిత్ర, కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, ఏజాజ్, ఏరాజ్‌పాష, రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు జీవన నైపుణ్యాలను నేర్పించాలి

దుద్యాల: ఆటల ద్వారా పిల్లలకు జీవన నైపుణ్యాలను నేర్పించాలని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు అన్నారు. యూఎస్ గాలా వారి ఆర్థిక సాయంతో దుద్యాల మండలంలోని హకీంపేట్ గ్రామంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నరేందర్, మ్యాజిక్ బస్ సిబ్బంది నరేశ్‌కుమార్, సతీశ్ బాబు, వెంకటయ్య, మహేందర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

కీసర రూరల్: నాగారంను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. పురపాలక పరిధిలోని ముప్పు ఎల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం స్వచ్ఛసర్వేక్షణ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

బొంరాస్‌పేట్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో కలిసి అధికారులు మంగళవారం ఇంటి నిర్మాణానికి ముగ్గులు వేసి పనులను ప్రారంభించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గులు వేసి నిర్మాణ విధానంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కొడంగల్: విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష పాల్గొన్నారు.

'అమృత్ భారత్' ఆరు నెలల్లో పూర్తి

(5వ పేజీ తరువాయి)

అంజన్ కుమార్ జైన్ సందర్శించారు. ముందుగా అమృత్ భారత్ కింద రైల్వే స్టేషన్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ మాస్టర్ గదిలో సిగ్నలింగ్ ప్యానల్ వ్యవస్థను పరిశీలించి, రికార్డులను చూశారు. కార్యక్రమంలో డీఆర్ఎం భర్తేశ్‌కుమార్, సీనియర్ డీఎస్సీ దెబాస్మిత్ చటర్జీ, సీనియర్ డీఎస్ఈ సుప్రియ, పీసీవోఎం పద్మజ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే

ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జీఎంను కలిసి కలిసి వినతిపత్రం అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తన నియోజకవర్గంలోని నవాబ్ పేట మండల పరిధిలో గల చిట్టిగడ్డ చించిల్‌పేట్ మధ్య, గొల్లగూడ స్టేషన్ వద్ద ఆర్‌యూబీలను నిర్మించాలన్నారు. ముబారక్‌పూర్ పర్వేద స్టేషన్ మధ్యలో ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి) నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. చిట్టిగడ్డ రైల్వే స్టేషన్లో అన్ని ప్యాసింజర్లు, ఫాస్ట్‌ప్యాసింజర్ రైళ్లను ఆపాలన్నారు. శంకర్‌పల్లి పట్టణంలో అన్ని రైళ్లను ఆపాలని విన్నవించారు.